సాక్షి
మహబూబ్‌నగర్
గురువారం । 14 । మార్చి । 2024



ఇంతింతై.. వటుడింతై

జడ్చర్లలోని డిగ్రీ కళాశాలలో బొటానికల్ గార్డెన్ అంతర్జాతీయ దృష్టిని ఆకర్షిస్తోంది.

వివరాలు 8లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-33 (గురువారం సాయంత్రం)

సహర్ 5-05 (శుక్రవారం తెల్లవారుజామున)

వాతావరణం

గరిష్టం/కనిష్టం 39.5 /20.9

ఆకాశం నిర్మలంగా ఉంటూ అప్పుడప్పుడూ మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

స్టేషన్ మహబూబ్‌నగర్: పదో **తరగతి పరీ**క్షలు రాసే విద్యార్థుల సౌకర్యా**ర్థం ఉమ్మడి** జిల్లాలోని అన్ని ఆర్టీసీ డిపోల **నుంచి ఈ నెల** 18 నుంచి వచ్చే నెల 2 వరకు **రద్దీ దృష్ట్యా** ఎలాంటి ఇబ్బందులు లేకుండా బస్సులు నడపనున్నట్లు రీజినల్ మేనేజర్ వి.శ్రీదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పరీక్ష రాసే బాలికలు తమ ఆధార్ కార్డు తప్పనిసరిగా కండక్టర్‌కు చూయించి జీరో టికెట్ తీసుకోవాలని, బాలురు తమ హాల్‌టికెట్‌తోపాటు ఏదైనా రూట్‌పాస్ లేదా ఫ్రీ స్టూడెంట్ బస్‌పాస్‌ను కండక్టర్‌కు చూయించి వారి గమ్యస్థానం నుంచి పరీక్ష కేంద్రం వరకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని చెప్పారు.

కందూర్ ఆలయంలో హుండీ లెక్కింపు



అడ్డాకుల: మండలంలోని కందూర్‌లో స్వయంభూగా వెలసిన శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో బుధవారం హుండీని లెక్కించారు. గతేడాది ఏప్రిల్ 3వ తేదీ నుంచి బుధవారం వరకు భక్తులు స్వామివారికి సమర్పించిన కానుకలను దేవాదాయ శాఖ మహబూబ్‌నగర్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వీణాధరి, ఆలయ ఈఓ రాజేశ్వరశర్మ ఆధ్వర్యంలో హుండీని తెరిచి లెక్కింపు చేపట్టారు. హుండీ ద్వారా రూ.4.77 లక్షల ఆదాయం సమకూరింది. కార్యక్రమంలో రవీందర్‌శర్మ, రాములు, బుచ్చన్నగౌడ్, వెంకట్రాములు, నాగరాజు, కృష్ణయ్య, మధుకర్‌రెడ్డి, చంద్రయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


రేపు ఫుట్‌బాల్ క్రీడాకారుల ఎంపికలు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం నారాయణపూర్‌లో త్వరలో జరిగే స్వామి వివేకానంద అండర్–20 జాతీయ ఫుట్‌బాల్ పోటీల్లో తెలంగాణ రాష్ట్రం నుంచి పాల్గొనే క్రీడాకారుల ఎంపిక, సన్నాహక శిక్షణ శిబిరం హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి భానుకిరణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారుల (వనపర్తి మినహా) ఎంపికలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎంపికల్లో క్రీడాకారులు తమ ఒరిజినల్ ధ్రువపత్రంతోపాటు ఆధార్‌కార్డుతో హాజరుకావాలని, పూర్తి వివరాల కోసం సెల్ నం.93964 39663ను సంప్రదించాలని సూచించారు.

మినీ స్టేడియంలో పే-ప్లే పద్ధతిలో ప్రాక్టిస్

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రం ఎంవీఎస్ కళాశాలలోగల మినీ ఇండోర్ స్టేడియంలో పే అండ్ ప్లే పద్ధతిలో బ్యాడ్మింటన్ ప్రాక్టిస్ చేసుకోవచ్చని డీవైఎస్‌ఓ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చేనెల 1 నుంచి ఉదయం, సాయంత్రం వేళల్లో క్రీడాకారులు ప్రాక్టిస్ చేసుకోవచ్చన్నారు. 15 ఏళ్లలోపువారు అడ్మిషన్ ఫీజు రూ.1,500, నెలవారీ రూ.వెయ్యి, 15 ఏళ్లలోపు వారు అడ్మిషన్ ఫీజు రూ.1,200, నెలవారీ రూ.800 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆసక్తిగల క్రీడాకారు లు అడ్మిషన్, ప్రాక్టిస్ సమయం గురించి సునీల్‌కుమార్- అథ్లెటిక్స్ కోచ్ (94406 56162), మల్లేష్- కబడ్డీ కోచ్ (89782 47482), అంజద్- స్విమ్మింగ్‌పూల్ కోచ్ (96769 96016)లను సంప్రదించాలని కోరారు.

మహమ్మారిని తరమికొడదాం



రాజాపూర్: మందులు వాడితే కుష్టు పూర్తిగా తగ్గుతుందని లెప్రసి రాష్ట్ర పరిశీలకుడు ప్రతాప్‌సంపత్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను ఆయన పరిశీలించారు. 24వరకు గ్రామాల్లో ఆశాలు సర్వే నిర్వహించి ఇంట్లో ఎవరికైన మచ్చలు ఉండి స్పర్శలేకుండా ఉంటే అటువంటి వారి పేర్లను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మరోసారి పరిశీలించి చికిత్స, మందులు ఇస్తారన్నారు. జిల్లా లెప్రసి ప్రోగ్రాం ఆఫీసర్ జరీనాబేగం, జిల్లా అధికారులు నర్సింహారెడ్డి, హనుమంతు, డీపీఎంఓ శ్రీనివాస్, మండల వైద్యాధికారి మధుసూదన్‌రావ్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వీడిన సస్పెన్స్..

బీజేపీ మహబూబ్‌నగర్ లోక్‌సభ అభ్యర్థిగా డీకే అరుణ

- 2వ జాబితాలో ప్రకటించిన ఆ పార్టీ అధిష్టానం
- పాలమూరులో ఈసారి కూడా త్రిముఖ పోరే..
- ఇప్పటికే నాగర్‌కర్నూల్ నుంచి భరత్‌కు అవకాశం
- అక్కడ కాంగ్రెస్ టికెట్ పెండింగ్.. మల్లురవి, సంపత్ మధ్య పోటాపోటీ
- బీఆర్‌ఎస్, బీఎస్పీ పొత్తులో భాగంగా ఆర్‌ఎస్పీకి అవకాశం

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఎవరనే దానిపై సస్పెన్స్ వీడింది. మాజీ మంత్రి, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పేరు ఖరారైంది. ఈ లోక్‌సభకు సంబంధించి డీకే అరుణతో పాటు పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డి, రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్ మధ్య టికెట్ పోరు కొనసాగడంతో అధిష్టానం పెండింగ్‌లో పెట్టిన విషయం తెలిసిందే. ఎట్టకేలకు బుధవారం రెండో జాబితాను ప్రకటించగా.. మహబూబ్‌నగర్ నుంచి డీకే అరుణకు చోటు దక్కింది. నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా ఎంపీ రాములు కుమారుడు, కల్వకుర్తి జెడ్పీటీసీ సభ్యుడు భరత్ ప్రసాద్ పేరును తొలి జాబితాలోనే ప్రకటించారు. ఉమ్మడి జిల్లాలో రెండు లోక్‌సభ స్థానాలకు బీజేపీ అభ్యర్థులు ఖరారుకావడంతో ప్రచారం జోరందుకోనున్నట్లు తెలుస్తోంది.

సుదీర్ఘ రాజకీయ అనుభవం..

డీకే అరుణ తొలిసారిగా 1996లో రాజకీయాల్లోకి వచ్చారు. టీడీపీ అభ్యర్థిగా మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానం నుంచి బరిలో నిలిచి.. కేంద్ర మాజీ మంత్రి, దివంగత నేత కాంగ్రెస్ అభ్యర్థి మల్లికార్జున్ చేతిలో స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఆ తర్వాత 1999 నుంచి 2018 వరకు వరుసగా గద్వాల అసెంబ్లీ స్థానం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేశారు. 1999లో ఓటమి చెందగా.. 2004, 2009, 2014లో వరుసగా హ్యాట్రిక్ విజయాలు సాధించారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కేబినెట్‌లో మంత్రిగా, ఆ తర్వాత రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి కేబినెట్లలో కూడా మంత్రిగా పనిచేశారు. 2018లో గద్వాల అసెంబ్లీ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అనంతర రాజకీయ పరిణామాల క్రమంలో బీజేపీలో చేరారు. 2019లో మహబూబ్‌నగర్ పార్లమెంట్ నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి.. బీఆర్‌ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు. ఇప్పటి వరకు ఐదు పర్యాయాలు ఎమ్మెల్యేగా పోటీచేసిన ఆమె మూడుసార్లు గెలుపొందారు. 1996, 2019లో మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేయగా.. 2024లో మరోసారి అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.



మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి ప్రొఫైల్..

పేరు : డీకే అరుణ

భర్త : డీకే భరత్‌సింహారెడ్డి

సంతానం: ముగ్గురు కూతుళ్లు

కుటుంబ నేపథ్యం: పుట్టినిల్లు, మెట్టినిల్లు కూడా రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం. తండ్రి చిట్టెం నర్సిరెడ్డి మాజీ ఎమ్మెల్యే కాగా, ఆమె మామ డీకే సత్యారెడ్డి, ఆమె భర్త డీకే భరత్‌సింహారెడ్డి ఎమ్మెల్యేలుగా పనిచేశారు. డీకే అరుణ బావ, డీకే భరత్‌సింహారెడ్డి అన్న, డీకే సమరసింహారెడ్డి మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు.

నాగర్‌కర్నూల్‌లో కాంగ్రెస్ టికెట్ పెండింగ్

నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌కు **సంబంధించి** కాంగ్రెస్, బీఆ**ర్‌ఎస్ అభ్యర్థులు** ఇంకా **ఖరారు కాలేదు.** కాంగ్రెస్‌లో **సీనియర్ నేత** మల్లురవి, మాజీ ఎమ్మెల్యే సంపత్ ఈ స్థానంలో టికెట్‌ను ఆశిస్తున్నారు. ఎవరికి వారు పట్టు కొనసాగిస్తుండడంతో ఆ పార్టీ అధిష్టానం అభ్యర్థిని ప్రకటించకుండా.. పెండింగ్‌లో పెట్టింది. బీఆర్‌ఎస్, బీఎస్పీ పొత్తులో భాగంగా ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ బరిలో నిలిచే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

సహకరిస్తారా..

బీజేపీలో మహబూబ్‌నగర్ పార్లమెంట్ టికెట్ కోసం డీకే అరుణతో పాటు పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డి, రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్ చివరి వరకు ప్రయత్నాలు చేశారు. డీకే అరుణకు అవకాశం దక్కడంతో వారికి భంగపాటు ఎదురైంది. ఈ క్రమంలో జితేందర్‌రెడ్డి, శాంతికుమార్ అనుచరుల్లో అసంతృప్తి నెలకొంది. ఈ మేరకు ఎన్నికల్లో వారు ఆమెకు సహకరిస్తారా.. లేదా అనేది పార్టీ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది. కాగా, టికెట్ ఖరారైన నేపథ్యంలో డీకే అరుణ మాట్లాడుతూ 'పార్టీలో టికెట్ కోసం ఎవరైనా పోరాడుతారు. ఒక్కసారి టికెట్ కేటాయించిన తర్వాత పార్టీ అభ్యర్థి గెలుపే ముఖ్యం. బీజేపీలో ఎలాంటి గ్రూప్‌లు ఉండవు. అందరినీ కలుపుకొనిపోయి విజయం సాధిస్తా.' అని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

గత లోక్‌సభ ఎన్నికల్లో 77,829 ఓట్ల తేడాతో ఓటమి..

డీకే అరుణ 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేశారు. తన సమీప ప్రత్యర్థి అయిన బీఆర్‌ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి చేతిలో 77,829 ఓట్ల తేడాతో ఓటమి చెందారు. డీకే అరుణకు 3,33,573 ఓట్లు రాగా, మన్నె శ్రీనివాస్‌రెడ్డికి 4,11,402 ఓట్లు వచ్చాయి. అదేవిధంగా కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన వంశీచంద్‌రెడ్డికి 1,93,631 ఓట్లు పోలయ్యాయి. కాగా.. ఈ సారి కూడా వీరి మధ్యనే పోరు కొనసాగనుంది.



సంగంబండ ప్రాజెక్టు సమస్యలను డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్‌కు వివరిస్తున్న ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యేలు వాకిటి శ్రీహరి, మధుసూదన్‌రెడ్డి తదితరులు

బండ పగలకొడతాం.. సాగునీరు పారిస్తాం

- జూరాల నుంచి కొడంగల్‌కు కృష్ణా జలాలు తరలించే కార్యక్రమం సీఎం చేపట్టారు
- వాకిటి శ్రీహరిని గెలిపించినందుకే ఇక్కడికి వచ్చాం
- పాలమూరు ఎంపీగా వంశీని గెలిపిస్తే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి
- మక్తల్ ప్రజాదీవెన సభలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సంగంబండలో ఎద్దులబండిపై డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తదితరులు

నారాయణపేట/ మక్తల్: 'బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో సంగంబండ రిజర్వాయర్ కింద ఉన్న బండను పగలకొట్టకుండా 15 గ్రామాలకు సాగునీరు అందించడంలో నిర్లక్ష్యం వహించింది.. నిర్వాసితులకు నష్ట పరిహారం చెల్లింపులోనూ మొండిచేయి చూపారు.. బండ పగలకొట్టింటే 25 వేల ఎకరాలకు సాగునీరు అందేది.. పైన రిజర్వాయర్ కింద కాల్వలు పూర్తయినా ఒక బండ పగలగొట్ట లేని చరిత్ర ఆ ప్రభుత్వానిది.. వారి నిర్లక్ష్యం వల్ల నీళ్లు లేక పదేళ్ల పాటు ఈ ప్రాంత రైతులు పంటలను ఎండబెట్టుకోవాల్సి వచ్చింది.. దీంతో 15 గ్రామాల్లో రైతుల పొలాలు ఎండిపోయాయి. సభాముఖంగా హామీ ఇస్తున్నా.. ఈ ప్రాంత రైతుల 19 ఏళ్ల కల నెరవేరబోతుంది.. ఆ బండ పగలగొట్టి సాగునీరు పారిస్తామ'ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం వారు స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో కలిసి సంగంబండ లో లెవల్ కెనాల్ కింద ఉన్న సంగంబండను పరిశీలించి ప్రజాదీవెన సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భీమా ప్రాజెక్టులో అంతర్భాగమైన సంగంబండ రిజర్వాయర్ లెఫ్ట్ లో లెవల్ కెనాల్ కోసం 500 మీటర్ల బండ తొలగి సంగంబండ గ్రామానికి చెందిన ముంపు బాధితులకు చెల్లించాల్సిన కూలీ డబ్బులు పదేళ్లుగా నిలిచిపోయాయని, దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక రెండు నెలల్లో రూ.12 కోట్లు ప్రభుత్వం ముంపు బాధితుల ఖాతాలో జమ చేసిందన్నారు. ఉజ్జెల్లికి రూ.13.34 కోట్లు, కొత్తగార్లపల్లికి రూ.1.19 కోట్లు జమ చేసేందుకు చొరవ తీసుకుంటామన్నారు. నేరడ్గం, ఆర్‌ఆర్ సెంటర్లు అనుగొండ, గడ్డంపల్లి గ్రామాలకు సైతం అందాల్సిన బెనిఫిట్స్ అందిస్తామన్నారు. పాలమూరు నుంచి వచ్చిన వ్యక్తి ఈ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నారు.. ఈ ప్రాంతంపై ఆయనకు పూర్తి అవగాహన ఉంది.. పాలమూరు సమస్యలు తెలిసినందుకే జూరాల నుంచి కొడంగల్- నారాయణపేట ప్రాంతాలకు ఎత్తిపోతల ద్వారా కృష్ణా నీళ్లు మళ్లించే పథకానికి రూ.3 వేల కోట్లు వెచ్చించారని చెప్పారు. మక్తల్‌లో కాంగ్రెస్ పార్టీ తరఫున నిలబడిన ముదిరాజ్ వాకిటి శ్రీహరిని గెలిపించినందుకే ఇక్కడికి వచ్చామని మంత్రులు పేర్కొన్నారు.

లక్ష మెజార్టీతో గెలిపించండి

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పాలమూరు ఎంపీ అభ్యర్థిగా వంశీచంద్‌రెడ్డిని ప్రకటించిందని, వంశీని లక్ష మెజార్టీతో గెలిపిస్తే.. ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామన్నారు. వంశీచంద్‌రెడ్డి గెలవక ముందే రూ.వందల కోట్ల నిధులు పాలమూరుకు తెచ్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. గెలిచాక తెలంగాణ రాష్ట్రంలో ఏ ఎంపీ చేయని విధంగా వంశీ పనిచేస్తాడనే నమ్మకం ఉందన్నారు. విద్యార్థి విభాగం నుంచి యువజన రాష్ట్ర కాంగ్రెస్, జాతీయ రాజకీయాల్లోకి వచ్చిన వంశీచంద్‌రెడ్డి సోనియా, రాహుల్‌గాంధీలతో అత్యంత సన్నిహితంగా ఉంటారన్నారు. వంశీచంద్‌రెడ్డికి మక్తల్ నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీ ఇవ్వాలని మంత్రులు విజ్ఞప్తి చేశారు.

రూ.350 కోట్లు మంజూరు చేయండి: వాకిటి శ్రీహరి

మక్తల్ నియోజకవర్గంలో ఏడు లిఫ్టు ఇరిగేషన్లు పునరుద్ధరించేందుకు రూ.350 కోట్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మంత్రులను కోరారు. ఎడ్యుకేషన్, ఇరిగేషన్‌లో అభివృద్ధికి సహకరించాలన్నారు. నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకం పేరులో తమ ప్రాంతం పేరు పెట్టాలని కోరడంతో మక్తల్- నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకం మార్చారన్నారు. అలాగే మక్తల్‌లో 33/11 కేవీ సబ్‌స్టేషన్, సంగంబండ దగ్గర సోలార్ ప్లాంట్ ఏర్పాటు, ఊట్కూర్ మండలం పూలిమామిడిలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్, దేవరకద్రలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానని మంత్రులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, నారాయణపేట డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, నాయకులు బాలకృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, హన్మంతు, సురేశ్‌కుమార్, రవికుమార్, గణేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బార్డర్‌లో సైనికులు.. కాంగ్రెస్ కార్యకర్తలు ఒక్కటే: వంశీచంద్

భారత్- పాకిస్తాన్ బార్డర్‌లో ప్రాణాలకు తెగించి టెర్రరిస్టులతో భారత సైనికులు ఎలా కొట్లాడుతారో.. మక్తల్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అలాంటి వారేనని ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. మక్తల్‌లో వాకిటి శ్రీహరిని ఎమ్మెల్యేగా గెలిపించడంతోనే మన పాలమూరు ముద్దు బిడ్డ రేవంత్‌రెడ్డి సీఎం అయ్యారని, మల్లు అనంతరాము తమ్ముడు భట్టి విక్రమార్క ఫైనల మంత్రిగా ఉన్నారని, పాలమూరు అల్లుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నీళ్ల మంత్రిగా ఉండటం మనందరి అదృష్టమని, వీరి ద్వారా పాలమూరును అభివృద్ధి చేసుకుందామని పేర్కొన్నారు.

నోడల్ అధికారుల నియామకం



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: రానున్న పార్లమెంట్ సాధారణ ఎన్నికల నిర్వహణకు భారత ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరించి నోడల్ అధికారులను నియమించినట్లు కలెక్టర్ రవినాయక్ అన్నారు. నోడల్ అధికారులందరూ వారి బాధ్యత, పాత్ర తెలుసుకొని ఎన్నికల నిబంధనల ప్రకారం విధులు నిర్వర్తించాలని సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పార్లమెంట్ ఎన్నికల నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సుమారు 18 మందిని నోడల్ అధికారులుగా నియమించామన్నారు. మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్, శిక్షణ కార్యక్రమాల నిర్వహణ, మెటీరియల్ మేనేజ్‌మెంట్, ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్‌మెంట్, కంప్యూటరైజేషన్, సైబర్ సెక్యూరిటీ, ఐటీ, స్వీప్, లా అండ్ ఆర్డర్, సెక్యూరిటీ ప్లాన్, ఈవీఎంల నిర్వహణ, ఎంసీసీ, ఎన్నికల వ్యయ పర్యవేక్షణ, బ్యాలెట్ పేపర్, పోస్టల్ బ్యాలెట్, ఈటీపీబీఎస్, కంట్రోల్ రూం, సీ విజిల్, ఫిర్యాదుల స్వీకరణ, పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పన, పోలింగ్ బృందాల మేనేజ్‌మెంట్ తదితర అంశాలపై నోడల్ అధికారులను నియమించినట్లు చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్‌రావు, ఏఎస్పీ రాములు, జెడ్పీ సీఈఓ రాఘవేంద్రరావు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలలో 62 పోస్టుల భర్తీకి ఆదేశాలు

మహబూబ్‌నగర్ క్రైం: పాలమూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఖాళీగా ఉన్న పలు పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిన భర్తీ చేయడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. మొత్తం 62 పోస్టులను భర్తీ చేయడానికి హైదరాబాద్‌లోని డీఎంఈ కార్యాలయంలో ఈ నెల 16న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఇందులో ప్రొఫెసర్ 3, అసోసియేట్ ప్రొఫెసర్ 16, అసిస్టెంట్ ప్రొఫెసర్ 12, సీనియర్ రెసిడెంట్స్ (ఎస్‌ఆర్) 11, ట్యూటర్స్ 20 పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేయనున్నారు. ఎంపికైన వారిలో ప్రొఫెసర్లకు రూ.1,90,000, అసోసియేట్ ప్రొఫెసర్లకు రూ.1,50,000, అసిస్టెంట్ ప్రొఫెసర్లకు రూ.1,25,000, ఎస్‌ఆర్‌లకు రూ.92,575, ట్యూటర్లకు రూ.55,000 వేతనం చెల్లిస్తారు.

కుటుంబాల్లో బంధాలను మెరుగుపరచాలి



మహబూబ్‌నగర్ రూరల్: సమాజంలో పిల్లలపై చాలా రకాల సంఘటనలు, అత్యాచారాలు, దోపిడీ జరుగుతుందని, దీనిని నివారించడానికి పాఠశాల స్థాయిలోనే నైతిక విద్య నేర్పించి కుటుంబ వ్యవస్థలో బంధాలను మెరుగుపరచడం చేయాలని అదనపు కలెక్టర్ మోహన్‌రావు అన్నారు. మహిళాభివృద్ధి, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాలల సంరక్షణ విభాగం జిల్లా సమీకృత భవనంలో పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. చట్టాల పట్ల అవగాహన కోసం ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో డీడబ్ల్యూఓ జరీనాబేగం, బాలరక్ష భవన్ కోఆర్డినేటర్ వెంకటమ్మ, డీసీపీఓ నర్మద, యూనిసెఫ్ రీసోర్స్‌పర్సన్ డేవిడ్ రాజ్, కేజీబీవీల ఎస్‌ఓలు పాల్గొన్నారు.

గణితంతోనే శాస్త్ర సాంకేతికాభివృద్ధి



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న రాజ్‌కుమార్, ప్రిన్సిపాల్ పద్మావతి, అధ్యాపకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఆధునిక ప్రపంచంలో శాస్త్ర సాంకేతికాభివృద్ధి సాధ్యపడుతుందని పీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ రాజ్‌కుమార్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో మేథమెటిక్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ సెమినార్‌లో ఆయన మాట్లాడారు. గణితశాస్త్రం అనువర్తనలు వైద్యరంగంలో ఎంతో కీలకంగా వినియోగిస్తున్నారని, అధునాతన చికిత్స కోసం నూతనంగా తయారు చేసే యంత్ర పరికరాలు గణితంతో ముడిపడి ఉన్నాయన్నారు. ముఖ్యంగా భవిష్యత్‌లో గణిత పరిధి మరింత విస్తరించి ఉన్న నేపథ్యంలో విద్యార్థులు ఆయా రంగాల్లో వచ్చే ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. గణిత శాస్త్రంలో మరిన్ని పరిశోధనలు జరగడం వల్ల మానవజీవితం మరింత సులభతరం అవుతుందని, విద్యార్థులు, అధ్యాపకులు పరిశోధనలపై దృష్టి సారించడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి, అధ్యాపకులు జీఎల్ రెడ్డి, పీయూ వీసీ ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డి, కన్వీనర్ రాములు, హరి ప్రసాద్, నిరంజన్‌గౌడ్, మురళీకాంత్, మాధవి, లత, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బీసీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో బ్యాంకింగ్, ఫైనాన్స్‌లో ఉచిత శిక్షణ పొందేందుకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ అధికారి ఇందిర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికి నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో రెండు నెలల పాటు హైదరాబాద్‌లో శిక్షణ ఇస్తారన్నారు. ఈ నెల 15 నుంచి 25 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పీయూలో మోదీ ప్రసంగం వీక్షణ



కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సెమీ కండక్టర్స్ ఫ్యాబ్రికేషన్ ఫెసిలిటీస్ తయారీ యూనిట్‌ను గుజరాత్‌లో ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి సంబంధించిన కార్యక్రమాన్ని పీయూ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్ ఇతర అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ సెమీ కండక్టర్స్ తయారీ ద్వారా సాంకేతిక రంగం మరింత అభివృద్ధి చెందుతుందని, యువత ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, భాస్కర్, కృష్ణయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే ఎన్టీఆర్ డిగ్రీ కళాశాలలోనూ విద్యార్థులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

మరికల్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మరికల్‌లో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. నర్వ మండలం లంకాలకు చెందిన నర్సింహులు (42) మరికల్ మండలంలోని మాధవరంలో బంధువుల పెళ్లికి వచ్చాడు. పెళ్లి వేడుక అనంతరం బైక్‌పై స్వగ్రామానికి వెళ్తూ.. ఆత్మకూర్ మార్గంలో ముందు వెళ్తున్న టిప్పర్‌ను ఢీకొట్టాడు. ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో మరికల్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు.. అప్పటికే అతడు మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈమేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ మురళి తెలిపారు.

ఇంటర్ విద్యార్థి బలవన్మరణం

మల్దకల్: మానసిక సమస్యతో బాధపడుతున్న ఓ ఇంటర్ విద్యార్థి వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ నరేష్‌గౌడ్ కథనం ప్రకారం.. మండలంలోని పాల్వాయికి చెందిన తిరుపతయ్య, తిరుపతమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు సంజీవులు(22) గద్వాలలో ఇంటర్ చదువుచున్నాడు. కొంతకాలంగా మానసిక సమస్యతో బాధపడుతుండేవాడు. అయితే బుధవారం వ్యవసాయ పొలానికి వెళ్లిన సంజీవులు పనులు ముగించుకొని తల్లిదండ్రులతో కలిసి ఇంటికి రాకుండా అక్కడే ఉండిపోయాడు. రాత్రి అయినా కుమారుడు ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చిన తల్లిదండ్రులు పొలం వద్దకు వెళ్లి చూడగా చెట్టుకు ఉరివేసుకొని మృతిచెందాడు. ఈ విషయమై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య



సరిత(ఫైల్)

కొత్తకోట రూరల్: భర్త వేధింపులు తాళలేక భార్య ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని ముమ్మళ్లపల్లిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి కథనం మేరకు.. పాన్‌గల్ మండలం బుసిరెడ్డిపల్లికి చెందిన కృష్ణయ్య కుమార్తె సరిత (25)ను కొత్తకోట మండలం ముమ్మళ్లపల్లికి చెందిన నాయిని మారుతికిచ్చి ఆరేళ్ల కిందట వివాహం జరిపించారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. మారుతి జిల్లాకేంద్రంలోని మార్కెట్‌యార్డులో కూలి పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తుండేవారు. బుధవారం ఉదయం భర్త, పిల్లలు బంధువుల ఇంట్లో జరిగే వివాహానికి వెళ్లారు. ఒంటరిగా ఉన్న సరిత ఇంట్లో ఉరేసుకుంది. ఇంటికి వచ్చిన మారుతి తలుపులు తెరిచి చూడగా సరిత ఉరేసుకొని కనిపించడంతో గ్రామస్తులు, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ సరిత తల్లిదండ్రులతో వివరాలు సేకరించారు. కొంతకాలంగా మారుతి అదనపు కట్నం కోసం భార్యను వేధించేవాడని తండ్రి వాపోయాడు. కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

మానవపాడు: చికిత్స పొందుతూ ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్లు రైల్వే కానిస్టేబుల్ రామకృష్ణ తెలిపారు. ఆయన కథనం మేరకు.. సుమారు 35 ఏళ్లున్న వ్యక్తి ఈ నెల 9న రాత్రి దాదాపు 10 గంటల సమయంలో మానవపాడు రైల్వేస్టేషన్‌లోని లూప్ లైన్ మధ్యలో గాయాలతో పడి ఉన్నాడు. వెంటనే చికిత్స నిమిత్తం 108 వాహనంలో కర్నూలు జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున 5.40 గంటలకు మృతి చెందినట్లు వివరించారు. కుడి చెయ్యి, ఎడమ వైపు ఛాతిపై అరుణ అని తెలుగులో పచ్చబొట్టు ఉన్నట్లు వివరించారు. మృతదేహాన్ని కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో భద్రపర్చామని.. వివరాల కోసం గద్వాల రైల్వే పోలీస్‌స్టేషన్‌లో, సెల్‌నంబర్లు 83090 67184, 87126 58608 సంప్రదించాలని సూచించారు.

బంగారు ఆభరణాలు చోరీ

గద్వాల క్రైం: జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో 29 తులాల బంగారు ఆభరణాలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్, బాధితుడి కథనం మేరకు.. మండలంలోని బీరెల్లికి చెందిన కృష్ణవర్ధన్‌రెడ్డి కుటుంబం గద్వాల నది అగ్రహారం రహదారిలో ఉన్న ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగే శుభకార్యానికి మంగళవారం రాత్రి వచ్చారు. రాత్రి అక్కడే ఓ గదిలో నిద్రించారు. బుధవారం ఉదయం లేచి చూసేసరికి ఆభరణాల బ్యాగు కనబడకపోవడంతో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు ఎస్ఐ వివరించారు.

ఇంతింతై.. వటుడింతై

దినదినాభివృద్ధి చెందుతున్న బొటానికల్ గార్డెన్

- అనుబంధంగా స్టేట్ హెర్బేరియం, బయోడైవర్సిటీ రీసెర్చ్ ఎడ్యుకేషన్ సెంటర్ ఏర్పాటు
- నేటితో నాలుగు వసంతాలు పూర్తి



జడ్చర్ల బీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలోని బొటానికల్ గార్డెన్

జడ్చర్ల టౌన్: పట్టుదల, కృషి ఉంటే ఏదైనా సాధించవచ్చని నిరూపించారు డాక్టర్ బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకుడు డా.సదాశివయ్య. అన్ని కళాశాలల మాదిరిగానే ఉన్న బీఆర్ఆర్ డిగ్రీ కళాశాల అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి పొందేలా బొటానికల్ గార్డెన్‌ను తీర్చిదిద్దారు. సాధారణ స్థితి నుంచి జడ్చర్లకే తలమానికంగా నిలిచిందనడంలో నిస్సందేహం. ఇంతింతై వటుడింతై అన్నట్టుగా దినదినాభివృద్ధి చెందుతున్న బొటానికల్ గార్డెన్.. నాలుగేళ్లు పూర్తిచేసుకుని, ఐదో వసంతంలోకి అడుగుపెడుతుంది. గార్డెన్‌కు అనుబంధంగా తెలంగాణ స్టేట్ హెర్బేరియం, బయోడైవర్సిటీ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ సెంటర్‌లను ఏర్పాటుచేశారు. స్కూల్ విద్యార్థులు మొదలు, పీహెచ్‌డీ స్కాలర్స్ వరకు పరిశోధనలు చేసుకునేందుకు వీలుగా గార్డెన్, హెర్బేరియం, ల్యాబ్‌లను తీర్చిదిద్దారు. 33 జిల్లాలతో కూడిన రాష్ట్ర మ్యాప్‌లా బొటానికల్ గార్డెన్‌ను తీర్చిదిద్దడంతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. 2020 మార్చి 15, 16, 17 తేదీల్లో కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్– 2, 3 విద్యార్థులతో పాటు పాలమూరు యూనివర్సిటీకి చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్–5 వలంటీర్లు మొత్తం 118మంది గార్డెన్‌కు రూపకల్పన చేసి, మొక్కలు నాటడం ప్రారంభించారు.

అనేక విశిష్టలతో గార్డెన్..

ఐదెకరాల్లోని బొటానికల్ గార్డెన్ అనేక విశిష్టలతో రూపుదిద్దుకుంది. మొత్తం 627 రకాల జాతులతో 6,500 మొక్కలు, చెట్లు ఉన్నాయి. దేశంలోనే అత్యంత తక్కువ విస్తీర్ణంలో ఇన్ని విశేషలు కలిగిన గార్డెన్ ఇదే కావడం గమనార్హం. గార్డెన్‌లోకి పలు పక్షులు రావడంతో పాటు నీటికొలనులోకి కింగ్ ఫిషర్‌బర్డ్ సైతం వచ్చి చేరింది. ఆధ్యాత్మికతతో వచ్చే వారికి నక్షత్రవనం (27 రకాల చెట్లు) రాశీవనం (12 రకాల చెట్లు) ఉన్నాయి. పవిత్ర వనంలో భగవద్గీత, ఖురాన్, బైబిల్‌లో సూచించిన మొక్కలు నాటారు.

పంచవటి వనం ప్రత్యేకత..

దేశంలో ఉన్న అన్ని మర్రిరకాల జాతులతో కూడిన పంచవటి వనం గార్డెన్‌లో ప్రత్యేకత. దక్షిణ భారత దేశంలో ఎక్కడాలేని విధంగా 27 రకాల మర్రిజాతుల మొక్కలు ఇక్కడ పెంచుతున్నారు.

స్టేట్ హెర్బేరియం..

స్టేట్ హెర్బేరియంలో రాష్ట్రంలోని అన్ని మొక్కల జాతులను భద్రపర్చారు. వీటిలో కొన్ని అంతరించిపోయినవి సైతం ఉన్నాయి. 120 ఏళ్లపాటు మొక్కలు అందుబాటులో ఉంటాయి. దీనివల్ల భవిష్యత్ వాతావరణం, పర్యావరణ మార్పులపై పరిశోధనలు చేసేందుకు ఉపయోగపడతాయి. ఫార్మాస్యూటికల్స్ ఇండస్ట్రీకి హెర్బేరియం ఎంతో అనుకూలంగా మారింది. వారికి రీసెర్చ్ సెంటర్‌గా ఉపయోగపడుతుంది. ఇప్పటికే మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వచ్చి పరిశోధనలు చేశారు. హెర్బేరియానికి 2023 సెప్టెంబర్‌లో అంతర్జాతీయ గుర్తింపు లభించింది. దేశంలో ఇలాంటి గుర్తింపు రావడం ఇదే ప్రథమం.

భారంగా మారుతున్న నిర్వహణ..

బొటానికల్ గార్డెన్ నిర్వహణ భారంగా మారుతోంది. కళాశాల నిధులు నిర్వహణ కోసం వెచ్చించాల్సిన అవసరం ఉన్నప్పటికీ.. ఆ దిశగా అడుగులు పడటంలేదు. భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా గార్డెన్ సవ్యంగా కొనసాగాలంటే.. కళాశాల అభివృద్ధి నిధుల నుంచి ఏటా కనీసం రూ.3 లక్షలు కేటాయించాల్సి ఉంది. లేదంటే పడిన శ్రమంతా నీరుగారే అవకాశాలున్నాయి.

ఫారెస్ట్ ఫీల్డ్ సిలబస్‌లో భాగం..

హైదరాబాద్‌లోని ఫారెస్ట్ అకాడమీలో ఫీల్డ్ సిలబస్‌లో బొటానికల్ గార్డెన్ సందర్శనను భాగం చేశారు. కళాశాలలోని సైన్స్ విద్యార్థులు 6వ సెమిస్టర్‌లో అటవీ ప్రాంతానికి వెళ్లాల్సి ఉండేది. మూడేళ్లుగా ఆ అవసరం లేకుండాపోయింది. వారు ఇక్కడే ప్రాజెక్టు వర్క్ చేస్తున్నారు. ఇతర కళాశాలల నుంచి కూడా వస్తున్నారు.



రీసెర్చ్ సెంటర్‌లో విద్యార్థులు

విద్యార్థులను పరిశోధనలవైపు మళ్లించాలని..



విద్యార్థులను పరిశోధనల వైపు మళ్లించాలనే సంకల్పంతో బొటానికల్ గార్డెన్ రూపొందించాను. అందుకు అనుబంధంగా హెర్బేరియం, బయోడైవర్సిటి రీసెర్చ్ ఎడ్యుకేషన్ సెంటర్ ప్రారంభించాం. హెర్బేరియానికి న్యూయార్క్ బొటానికల్ గార్డెన్‌లోని ఇండెక్స్ హెర్బరోరియం గుర్తింపు లభించడం గర్వకారణం. ఇప్పటికే ఫారెస్ట్ అకాడమీ వారి సిలబస్‌లోనూ గార్డెన్ సందర్శన పాఠ్యాంశంగా పొందుపర్చారు. ఇక్కడ ముగ్గురు పరిశోధనలు చేసి, పీహెచ్‌డీ పట్టా పొందారు.

– డా.సదాశివయ్య, సమన్వయకర్త, బొటానికల్ గార్డెన్

నిర్వహణలోపం లేకుండా చర్యలు..



కళాశాలకు తలమానికంగా నిలిచిన బొటానికల్ గార్డెన్ నిర్వహణలోపం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. గార్డెన్‌కు మంజూరైన రూ.50 లక్షలు పూర్తి వినియోగం చేసి, ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం. స్కూల్ విద్యార్థుల నుంచి పీహెచ్‌డీ స్కాలర్స్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, చివరకు ఫార్మాస్యూటికల్ కంపెనీ పరిశోధనలకు సైతం అనుకూలంగా ఉండటం గర్వంగా ఉంది.

– డా.అప్పియాచిన్నమ్మ, ప్రిన్సిపాల్, బీఆర్ఆర్ కళాశాల, జడ్చర్ల

కేసీఆర్‌ను ఆకర్షించిన గార్డెన్..

33 జిల్లాలతో కూడిన తెలంగాణ మ్యాప్ ఆకృతిలో ఉన్న గార్డెన్ గత సీఎం కేసీఆర్‌ను ఆకర్షించింది. 2020 జూలైలో కేసీఆర్ స్వయంగా గార్డెన్ సమన్వయకర్త సదాశివయ్యను పిలిపించుకుని, గార్డెన్ అభివృద్ధికి రూ.50 లక్షలు మంజూరుచేశారు. అయితే పలు కారణాల వల్ల కేవలం రూ.22లక్షలు మాత్రమే వినియోగించారు. మిగిలిన వాటిలో కొన్ని బిల్లులు రావాల్సి ఉంది.

బయోడైవర్సిటీ రీసెర్చ్ ఎడ్యుకేషన్ సెంటర్..



గార్డెన్‌కు అనుబంధంగా ఏర్పాటుచేసిన బయోడైవర్సిటీ రీసెర్చ్ ఎడ్యుకేషన్ సెంటర్‌లో బాటనీ, జువాలజీ పరిశోధనలు చేసుకునే వెసులుబాటు ఉంది. అందుకు అవసరమైన పూర్తి లిటరేచర్ అందుబాటులో ఉంచారు. అడవులు, మొక్కలు, జంతువులపై పరిశోధనలకు అవసరమైన సాహిత్యం ఉంది. విద్యార్థులు పరిశోధనలవైపు మళ్లించాలనే లక్ష్యంతోనే ఈ సెంటర్ ఏర్పాటుచేశారు.

మహిళ దారుణహత్య

బల్మూర్–అచ్చంపేట రహదారి పక్కన ఘటన

- వారం క్రితం హత్య చేసినట్లు అనుమానాలు
- పూర్తిగా కుళ్లిపోయిన మృతదేహం.. ఘటన స్థలంలోనే పోస్టుమార్టం
- ఆధారాలు సేకరించిన క్లూస్ టీం

బల్మూర్: ఓ గుర్తు తెలియని మహిళ (40)ని అతి దారుణంగా హత్యచేసి ముళ్లపొదల్లో పడేసిన ఘటన బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలం మైలారం శివారు వ్యవసాయ పొలంలో వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. బల్మూర్–అచ్చంపేట రహదారిలోని మైలారం శివారు వీరంరాజ్‌పల్లి స్టేజీకి ఎదురుగా ఉన్న ముళ్లపొదల్లోకి బుధవారం ఉదయం కొండనాగులకు చెందిన ఓ యువకుడు బహిర్భూమికి వెళ్లారు. అక్కడ గులాబీ రంగు చీర, జాకెట్ ధరించి ఉన్న మహిళ మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించగా మృతదేహం కుళ్లిపోయి కనిపించింది. కాళ్లు, చేతులను తాడుతో కట్టేసి తలపై బండరాయితో మోదడంతో పాటు కాళ్లు విరగ్గొట్టడమే కాకుండా మద్యం సీసాలు పగులగొట్టి విచక్షణా రహితంగా కోసి అతి కిరాతకంగా హత్య చేసిన ఆనవాళ్లు ఉన్నాయి. ముళ్లపొదలు దట్టంగా ఉండటంతో మృతదేహాన్ని ఎవరూ గుర్తించలేకపోయారు. హత్యచేసి వారం రోజులు కావచ్చని కుళ్లిన మృతదేహాన్ని బట్టి పోలీసులు అనుమానిస్తున్నారు. అత్యాచారం చేసిన తర్వాతే హత్యచేసి ఉంటారని, లింగాల, తెల్కపల్లి, బల్మూర్ మండలాలకు చెందిన మహిళగా అనుమానిస్తున్నారు.

ఘటన స్థలంలో మద్యం సీసాలు..

క్లూస్‌టీం ఘటన స్థలంలోని మద్యం, నీటి సీసాలు, చెప్పులను స్వాధీనం చేసుకుంది. ముందస్తు పథకం ప్రకారమే మహిళను ఇక్కడికి తీసుకొచ్చి మద్యం తాగించి హత్యచేసి ఉంటారని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

పరిశీలించిన డీఎస్పీ..

ఘటనా స్థలాన్ని అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాస్ పరిశీలించారు. మైలారం మాజీ సర్పంచ్ శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు అచ్చంపేట సీఐ రవీందర్ పర్యవేక్షణలో కేసు నమోదు చేసి మృతదేహానికి అక్కడే వైద్యులతో పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేసినట్లు ఎస్ఐ బాలరాజు వివరించారు. ఈ ఘటనతో మండలంలోని మైలారం, బల్మూర్, వీరంరాజ్‌పల్లి గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

పక్కదారి పడుతున్న ఇసుక రవాణా



టిప్పర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న మైనింగ్ అధికారి భరణి

జడ్చర్ల: మిడ్జిల్ మండలం అయ్యవారిపల్లి గ్రామ సమీపంలో దుందుభీ వాగు పరివాహక ప్రాంతంలో సీజ్ చేసిన ఇసుక డంపులను అధికారులు వేలం వేసి జిల్లాకేంద్రంలో నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రి నిర్మాణ పనులకు వినియోగించే విధంగా ఉత్తర్వులు ఇవ్వగా ఆయా నిబంధనలను ఉల్లంఘించి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. బుధవారం ఇలా పలు ఇసుక టిప్పర్లను జడ్చర్లలో మైనింగ్ అధికారులు తనిఖీ చేయగా అనుమతి పత్రాలు లేవని డ్రైవర్లు చెప్పారు. దీంతో ఆయా టిప్పర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అయితే మైనింగ్ అధికారి భరణి ఇసుక టిప్పర్లను ఆపి పత్రాలను చూపించాలని కోరగా డ్రైవర్ తనతో పత్రాలు లేవని సమాధానం ఇవ్వడంతో ఆమె టిప్పర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తర్వాత అనుమతి పత్రాలు తీసుకువచ్చి చూపించడంతో వదిలిపెట్టారు. అయితే టిప్పర్ల వెంట అనుమతి పత్రాలు లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది. ఒకే అనుమతి పత్రంతో పలు టిప్పర్లలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అంతేగాక ఇసుకను తరలిస్తున్న టిప్పర్లకు వెనక వైపు నంబర్ ప్లేట్స్ కూడా లేకపోవడం గమనార్హం. దీంతో నిర్దేశిత ప్రాంతానికి ఇసుక తరలించకుండా మార్గమధ్యలోనే అక్రమంగా విక్రయిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. కాగా తమ గ్రామం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని అయ్యవారిపల్లి గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అనుమతులు ఒక చోట ఉంటే ఇసుక తరలింపు మరో చోటుకు అని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఇసుక తరలింపులో పారదర్శకత పాటించాలని ప్రజలు కోరుతున్నారు.

అదుపుతప్పి సిమెంట్ దిమ్మెను ఢీకొట్టిన బైక్

- ఒకరు మృతి.. మరొకరికి తీవ్రగాయాలు



నర్సింహగౌడ్ (ఫైల్)

కొత్తకోట రూరల్: బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కనున్న బస్టాండ్ సిమెంట్ దిమ్మెను ఢీకొట్టిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందగా.. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన కొత్తకోట మండలం రాయిణిపేట స్టేజీ వద్ద ఎన్‌హెచ్–44పై బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి వివరాల మేరకు.. మండలంలోని అప్పరాలకు చెందిన నర్సింహగౌడ్ (42) నాగవరంలోని బంధువుల పెళ్లికి రమేష్‌సాగర్ అనే వ్యక్తితో కలిసి బైక్‌పై వెళ్లారు. వివాహ వేడుక అనంతరం తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా.. రాయిణిపేట స్టేజీ వద్ద బైక్ అదుపుతప్పి బస్టాండ్ సిమెంట్ దిమ్మెను ఢీకొట్టింది. ప్రమాదంలో నర్సింహగౌడ్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. రమేష్‌సాగర్‌కు ఎడమ కాలు విరిగిపోవడంతో పాటు తీవ్రగాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. నర్సింహగౌడ్ మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కాగా, మృతుడికి భార్య లక్ష్మితో పాటు ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నట్టు గ్రామస్తులు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి..



మృతుడి వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

పెబ్బేరు మండలం తోమాలపల్లి వైపు నుంచి కొత్తకోటకు వస్తున్న వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి రాయిణిపేట స్టేజీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదాన్ని గమనించి, సహాయక చర్యలు చేపట్టారు. ఘటనా స్థలానికి అంబులెన్స్‌ను పిలిపించి, క్షతగ్రాతుడిని వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అతడికి మెరుగైన చికిత్స అందించాలని ఆస్పత్రి సిబ్బందికి ఫోన్ ద్వారా తెలియజేశారు. మృతుడు నర్సింహాగౌడ్ కుటుంబానికి ప్రభుత్వపరంగా అండగా ఉంటామని తెలిపారు.

ఎరువుల వాడకంలో సమతుల్యం అవసరం

- పంటల్లో చీడపీడల నివారణ
- తగ్గనున్న పెట్టుబడి
- సమతుల్య సమగ్ర ఎరువుల యాజమాన్యం పాటించాలి
- ఏడీఏ సక్రియనాయక్

పాడి–పంట

అధికారి సలహా: సక్రినాయక్, ఏడీఏ, అలంపూర్



పొలంలో వేయడానికి సిద్ధంగా ఉన్న ఎరువులు

అలంపూర్: ఆహార ధాన్యాల ఉత్పత్తికి చేపట్టాల్సిన చర్యల్లో సమతుల్య సమగ్ర ఎరువుల యాజమాన్యం ముఖ్యమైనది. దేశంలో ఎరువుల వాడకం తక్కువగా ఉన్నప్పటికీ.. పోషకాల సమతుల్యత, సమగ్ర ఎరువుల విధానం పాటించకపోవడం సమస్యగా మారింది. రాబోయే రోజుల్లో దేశ జనాభాకు తగ్గట్టుగా 30 వేల కోట్ల టన్నుల ఆహార ధాన్యాలు అవసరం కాగా.. 4.5 కోట్ల టన్నుల ఎరువులు అవసరం ఉంటుందని నిపుణుల అంచనా. ఈ మేరకు ఆహార ధాన్యాల ఉత్పత్తిలో సమతుల్య సమగ్ర ఎరువుల యాజమాన్యం పాటించాల్సిన ఆవశ్యకత ఉందని ఏడీఏ సక్రియనాయక్ చెబుతున్నారు. భూసార పరీక్షల ఆధారంగా సిఫారసు చేసిన ఎరువులను మోతాదు మేరకు సకాలంలో ఎరువులు అందించాలని పేర్కొంటున్నారు.

సమగ్ర ఎరువుల వాడకం..

రసాయన, సేంద్రియ, జీవన ఎరువులతో తగిన రీతిలో పైర్లకు పోషకాలు అందించడాన్ని సమగ్ర ఎరువుల వాడకంగా పేర్కొంటారని ఏడీఏ తెలిపారు. పైరుకు సిఫారసు చేసిన పోషకాల మోతాదులో మూడింట రెండు వంతులు రసాయన, ఒకవంతు సేంద్రియ, జీవన ఎరువుల ద్వారా అందించినప్పుడు దీర్ఘకాలం భూసారం పెరగడంతో పాటు అధిక దిగుబడి సాధించవచ్చు.

నత్రజని: పురుగులు పంటపై దాడిచేసి నష్టం కలిగించడానికి, నత్రజని వాడకానికి సంబంధం కనిపిస్తోంది. నత్రజని అధికంగా వేసినప్పుడు మొక్క ఏపుగా పెరిగి.. ఆకులు, కాడలు బిరుసుతనం కోల్పోయి పురుగులు తినడానికి అనువుగా ఉంటుంది. అనేక పైర్లపై జరిగిన పరిశోధనల్లో సిఫారసు చేయబడిన మోతాదుకు మించి నత్రజని వాడకం వల్ల పురుగుల బెడద ఎక్కువైనట్లు రుజువైందని ఏడీఏ తెలిపారు. నత్రజనిని వీలైనంత వరకు విభజించి వేయడం మంచిదని పేర్కొన్నారు.

భాస్వరం: దీని ప్రభావం చీడపీడల నివారణలో ప్రత్యక్షంగా కనిపించకపోయినా.. సమతుల్యతలో పరోక్షంగా ప్రముఖ పాత్ర వహిస్తోంది. అధిక నత్రజని వల్ల కలిగే దుష్ప్రయోజనాలను భాస్వరం తగ్గిస్తోంది. నత్రజని, భాస్వరం పూర్తి స్థాయిలో సమతుల్యంగా ఉన్నప్పుడు, మొక్క రెండింటిని సమతుల్యంగా వినియోగించుకుంటుంది. మొక్క తొలి దశలో వేర్లు బాగా వృద్ధి చెందడానికి, నేల నుంచి పోషకాలను తీసుకోవడానికి భాస్వరం తోడ్పడుతుంది. వీటి ఫలితంగా చీడపీడల తాకిడి తక్కువగా ఉంటుంది.

పొటాష్: చీడపీడల యాజమాన్యంలో పోటాష్ కీలక పాత్ర పోషిస్తోంది. తగినంత పోటాష్ అందించినప్పుడు మొక్కలో కొన్ని రకాల ఫినాలిక్ కాంపౌండ్స్ తయారై రక్షణగా ఉంటాయి. పోటాష్ అధికంగా ఉండే మొక్కల కణజాలం తినడానికి పురుగులకు రుచించదు. కణకవచం (సెల్‌వాల్) గట్టిగా తయారై, దండెత్తే పురుగులకు అడ్డుగోడగా నిలుస్తుంది. వరి పైరులో చీడపీడలపై అధిక ప్రభావం చూపి, సమర్థవంతంగా అరికడుతుంది. బాక్టీరియా బూజు సంబంధమైన తెగుళ్లను 70శాతానికిపైగా అరికడుతుంది. పురుగులు, మైట్స్ దాడి నుంచి 60శాతానికి పైగా రక్షించబడుతుంది. నెమటోడ్స్, వైరస్‌లు సైతం అధిక భాగంలో తగ్గుతాయి. చెరుకు పైరుకు తగినంత పోటాష్ వేసినప్పుడు పొలుసుపురుగు (స్కేల్‌ఇన్‌సెక్ట్), పత్తిలో ముక్కు పురుగు ఉధృతి బాగా తగ్గుతుంది. టమాట, మిరప, వంకాయ, బంగాళదుంప వంటి కూరగాయల పైర్లకు తగినంత పోటాష్ అందిస్తే పురుగుల తాకిడి తక్కువగా ఉంటుంది. పోటాషియం శాతం అధికంగా ఉండే మామిడి మొక్కల్లో తేనెమంచు పురుగు దాడి అతి తక్కువగా ఉంటుంది. సమతుల్య సమగ్ర ఎరువుల వాడకంతో పెట్టుబడి తగ్గుతుంది. చీడపీడల నిరోధానికి తోడ్పడి, పురుగు మందులను తగ్గిస్తోంది. దీన్ని ఫలితంగా నికర ఆదాయం పెరగడమేకాక, వాతావరణ కాలుష్య నివారణకు దోహదపడుతుంది.

బ్యాంకు ఉద్యోగిపై కేసు నమోదు

జడ్చర్ల: బ్యాంకులో వ్యవసాయ పెట్టుబడులకు గాను ఓ రైతు తన బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టి రుణం తీసుకున్న ఘటనలో రుణం బ్యాంకుకు చెల్లించినా ఆభరణాలను బ్యాంకు సిబ్బంది ఒకరు రైతుకు అప్పగించకుండా దుర్వినియోగం చేసిన ఘటన పట్టణంలో వెలుగులోకి వచ్చింది. దీనిపై బ్యాంకు మేనేజర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

తాళం వేసిన ఇంట్లో చోరీ: నిందితుడి గుర్తింపు

గోపాల్‌పేట: తాళం వేసిన ఇంట్లో చోరీ చేసిన ఘటన మండలంలోని బుద్దారంలో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గోపాల్‌పేట ఎస్ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. బుద్దారం గ్రామానికి చెందిన శివానందరావు భార్యతో కలిసి శనివారం హైదరాబాద్‌లోని కుటుంబ సభ్యుల ఇంటికి వెళ్లారు. బుధవారం ఉదయం నాలుగు గంటల ప్రాంతంలో శివానందరావు ఇంటి పక్కల వారు ఫోన్ చేసి ఇంట్లో దొంగలు పడినట్లున్నారని సమాచారం అందించారు. దీంతో ఆయన గ్రామానికి చేరుకుని చూడగా ఇల్లు తాళం పగులగొట్టి ఇంట్లో బీరువాలో ఉన్న నాలుగు వరుసల బంగారు గొలుసు, రెండు జతల చెవి కమ్మలు కలిపి మొత్తం ఐదున్నర తులాల బంగారం, రూ.20 వేలు దొంగిలించినట్లుగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు ఫింగర్ ప్రింట్స్ టీం, జాగిలాన్ని పిలిపించి పరిశీలించగా.. గ్రామానికి చెందిన ఏశమోని ఆంజనేయులు బైకుపై అనుమానాస్పదంగా వెళ్లడం గమనించి, విచారణ చేయగా బైకులో బంగారం, డబ్బులు దొరికాయి. నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్ చేశామని ఎస్ వివరించారు. డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు, సీఐ నాగభూషణ్‌రావు ఘటన స్థలాన్ని పరిశీలించారు. చాకచక్యంగా వ్యవహరించిన కానిస్టేబుళ్లు వంశీ, ఆంజనేయులును డీఎస్పీ, సీఐ అభినందించారు.



కర్ణాటక మద్యం పట్టివేత



అయిజ: మండలంలోని కుటుకనూరు శివారులో అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని మంగళవారం అర్ధరాత్రి పట్టుకున్నామని ఎక్సైజ్ సీఐ గణపతిరెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని కనికవీడుపేటకు చెందిన కుర్వ మల్లేష్, కుర్వ రాముడు ద్విచక్ర వాహనంపై కర్ణాటక మద్యాన్ని ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తుండగా గద్వాల స్టేషన్ ఎక్సైజ్ అధికారులతో కలిసి పట్టుకున్నామన్నారు. వారి నుంచి ద్విచక్ర వాహనం, 25.92 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకొని, ఇద్దరిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్ఐలు వెంకటేష్, నాగరాజు, కానిస్టేబుళ్లు మహేష్, వేణు, శేఖర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అనాథ అని చేరదీస్తే.. భూమి కాజేశాడు

జడ్చర్ల: అనాథ అని చేరదీస్తే.. నమ్మించి తన తల్లి పేరున ఉన్న భూమిని రిజిస్ట్రేషన్ చేసుకొని మోసం చేశాడని ఓ మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని చర్లపల్లికి చెందిన దాసరి అనసూయమ్మకు కుమార్తె సరోజ ఉంది. కాగా వ్యవసాయ పనులకు వెళ్లే కూలీలకు ఓ బాలుడు దొరకగా.. చేరదీసి అనసూయమ్మకు అప్పగించారు. మగ సంతానం లేకపోవడంతో బాలుడిని అక్కున చేర్చుకొని శ్రీనివాసులుగా నామకరణం చేసి పెంచింది. అనసూయమ్మ మరణించడంతో ఆమె పేరున ఉన్న 4.28 ఎకరాల భూమిని అక్క సరోజ పేరున చేస్తానని నమ్మించి సంతకాలు తీసుకొని తన పేరున రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. విషయం తెలిసి నిలదీయగా చంపుతానంటూ భయపెడుతున్నాడని.. సరోజ ఫిర్యాదు చేసినట్లు సీఐ వివరించారు.

నేరుగా వచ్చి ఆత్మహత్యాయత్నం

ఫోన్ మాట్లాడుతూ ట్రాక్‌పైకి వచ్చింది

జన్మభూమి ఎక్స్‌ప్రెస్ లోకో పైలట్ విజయ్‌రామ్ వాంగ్మూలం



సాక్షి ప్రతినిధి, గుంటూరు: 'గుంటూరు నుంచి 12.05 గంటల ప్రాంతంలో తెనాలి స్టేషన్ దగ్గరకు వచ్చేసరికి అప్పటి వరకూ ఫోన్ మాట్లాడుతూ ట్రాక్ పక్కన నిలబడిన యువతి ఒక్కసారిగా ట్రాక్ పైకి వచ్చేసింది. ఆమెను తప్పుకోమని అరుస్తూ ఎమర్జెన్సీ బ్రేక్ వేశా. అయితే అప్పటికే రైలు ఇంజన్ ఆమెకు తగిలింది. స్పృహ తప్పి పడిపోయిన ఆమెను ప్రయాణికుల సహకారంతో ట్రెన్ ఎక్కించుకుని తెనాలి స్టేషన్‌లో స్టేషన్ మాస్టర్‌కి అప్పగించా'నని జన్మభూమి ఎక్స్‌ప్రెస్ లోకో పైలెట్ విజయ్‌రామ్ జీఆర్‌పీ పోలీసులకు అప్పుడే స్టేట్‌మెంట్ ఇచ్చారు. రైల్వే స్టేషన్ మాస్టర్ దగ్గర ఉన్న పుస్తకంలో కూడా ప్రమాదానికి సంబంధించిన వివరాలను నమోదు చేశారు. సోషల్ మీడియా ట్రోలింగ్‌లకు గీతాంజలి ఈ నెల ఏడున రైలు కింద పడి ఆత్మహత్యాయత్నం చేయడం ఆ తర్వాత చికిత్స పొందుతూ మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంపై తెలుగుదేశం సోషల్ మీడియాలోనూ, అఫిషియల్ మీడియాలో కూడా ఈ వ్యవహారాన్ని తప్పుదోవ పట్టించేలా కామెంట్స్ పెడుతున్నారు. ఎవరో ఇద్దరు వ్యక్తులు ఆమెను రైలు కిందకు తోసేసి పరారు అయ్యారంటూ ఒక వీడియోలో ఇద్దరు మాట్లాడుకుంటున్నట్లుగా చూపిస్తూ మార్ఫింగ్ వీడియోని సర్క్యులేట్ చేస్తున్నారు. దీనిని ఎడిట్ చేసి బయటకు వదిలినట్లుగా పోలీసుల విచారణలో స్పష్టం అయ్యింది. ఈ వీడియోను సర్క్యులేట్ చేసింది ఎవరు? అనేదానిపై కూడా విచారణ జరుపుతున్నారు. చనిపోయిన తర్వాత కూడా వదలకుండా ఆమె వ్యక్తిత్వాన్ని తప్పు పట్టేవిధంగానే తెలుగుదేశం సోషల్‌మీడియాలో బురదజల్లుతోంది. లోకోపైలెట్ ఇచ్చిన స్టేట్‌మెంట్‌తో అసలు ఈ వ్యవహారంలో ఎవరి ప్రమేయం లేదని, ఆమె ఒక్కతే వచ్చి ఆత్మహత్యాయత్నం చేసుకున్నట్లు స్పష్టం అవుతోంది. అయినా తెలుగుదేశం చేస్తున్న తప్పుడు ఆరోపణల నేపథ్యంలో పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. తెనాలి డీఎస్పీ రమేష్ ఆధ్వర్యంలో పోలీసుబృందం బుధవారం సంఘటనా స్థలానికి వెళ్లి అక్కడ చుట్టుపక్కల వారిని విచారించింది. దగ్గరలో ఏమైనా సీసీ కెమెరాలు ఉన్నాయా అన్న విషయాన్ని ఆరా తీసింది. సోషల్‌మీడియా ట్రోలింగ్‌ల నేపథ్యంలో మృతి చెందినట్లు ఆమెకుటుంబ సభ్యుల ఫిర్యాదు నేపథ్యంలో ట్రోలింగ్‌కు పాల్పడిన హ్యాండిల్స్‌ను గుర్తించి బాధ్యులను అదుపులోకి తీసుకునే దిశగా పోలీసు బృందాలు తమ విచారణ వేగవంతం చేశాయి. ఒక బీసీ మహిళను వేధించి ఆత్మహత్యకు పురికొల్పడమే కాకుండా చనిపోయిన తర్వాత కూడా ఈ విధంగా ట్రోల్ చేయడాన్ని తెలుగుదేశం పార్టీలోనే కొందరు తప్పు పడుతున్నారు.

నాడు రిషితేశ్వరిని ఇలాగే పొట్టన పెట్టుకున్నారు

నాడు రిషితేశ్వరి నుంచి నేటి గీతాంజలి వరకూ పచ్చమూకల వికృత చర్యలకు బలైపోయిన వారే. తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు, సోషల్ మీడియా ఎవరిని తీసుకున్నా వారికి ముందు నుంచి మహిళలంటే చిన్నచూపే. 2015లో గుంటూరు జిల్లాలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆర్కిటెక్చర్ విద్యార్థిని ఎం. రిషితేశ్వరి ర్యాగింగ్‌కు గురై యూనివర్సిటీ వసతి గృహంలో ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. బీసీ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థిని ఆత్మహత్యకు కారణమైన యూనివర్సిటీ అధికారులు, సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోకుండా అప్పటి చంద్రబాబు ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా మౌనం వహించింది. విద్యార్థిని మృతికి కారణమైన అప్పటి ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.బాబురావుతోపాటు అప్పుడు యూనివర్సిటీ పరిపాలనలో ఉన్న ఉన్నతాధికారులపై కేసు నమోదు చేయాలని, రిషితేశ్వరి కుటుంబానికి న్యాయం చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు పెద్ద ఎత్తున ఉద్యమం చేశాయి. బలహీన వర్గాల విద్యార్థినికి న్యాయం చేసేందుకు అప్పటి టీడీపీ ప్రభుత్వప్రయత్నించకపోగా న్యాయం కోసం ఉద్యమిస్తున్న వారిని అడ్డుకుంది. రిషితేశ్వరి మరణానికి కారకులపై చర్యలు తీసుకోవాలని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఉద్యమం చేస్తున్నాయనే కారణంతో ప్రభుత్వం, యూనివర్సిటీ ఉన్నతాధికారులు యూనివర్సిటీ విద్యార్థి సంఘాలను నిషేధించారు. యూనివర్సిటీలో ఉన్న విద్యార్థి సంఘాల బోర్డులను సైతం తొలగించారు. ఉద్యమాన్ని అణిచేందుకు ప్రభుత్వం శతవిధాలా ప్రయత్నించింది. విద్యార్థిని ఆత్మహత్యలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులను రక్షించేందుకు టీడీపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని అప్పట్లో ప్రజాసంఘాలు బహిరంగంగానే ఆరోపణలు చేశాయి. విచారణ కమిటీల పేరుతో కాలయాపన చేసింది. రిషితేశ్వరి ఆత్మహత్యపై కథనాలు రాస్తున్నారనే అక్కసుతో కొందరు మీడియా ప్రతినిధులపై కేసులు నమోదు చేస్తామని కూడా బెదిరించారు. రాష్ట్రంలో బలహీన వర్గాల మహిళల ప్రాణాలకు రక్షణ లేదని రిషితేశ్వరి మరణానికి కారకులపై చర్యలు తీసుకోవాలని, చంద్రబాబు ప్రభుత్వం ఉద్దేశపూర్వకమైన నిర్లక్ష్యం వీడాలని అప్పట్లో ఎమ్మెల్యే ఆర్కే రోజాతోపాటు పలువురు అసెంబ్లీ సాక్షిగా చంద్రబాబు ప్రభుత్వాన్ని నిలదీశారు. తప్పనిసరి పరిస్థితుల్లో టీడీపీ ప్రభుత్వం అప్పటి ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.బాబురావుపై చర్యలు తీసుకుందే తప్ప చిత్తశుద్ధితో వ్యవహరించలేదు. ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నా కూడా బుద్ధి మార్చుకోలేదు.

ముఖ్యమంత్రి ప్రసంగంలో తప్పేముంది?

- జన్మభూమి కమిటీలను, వలంటీర్లతో పోల్చి మాట్లాడటం తప్పెలా అవుతుంది?
- వలంటీర్లు ఎన్నికల విధుల్లో పాల్గొనాలో వద్దో తేల్చాల్సింది ఎన్నికల సంఘమే
- స్పష్టం చేసిన హైకోర్టు ధర్మాసనం
- వలంటీర్లను ఎన్నికల విధులకు దూరంగా ఉండాలని ఆదేశాలిచ్చామన్న ఈసీ
- అలా అయితే విచారించేందుకు ఏమీ లేదన్న ధర్మాసనం.. పిల్ కొట్టివేత



సాక్షి, అమరావతి: పల్నాడు జిల్లాలో ఇటీవల నిర్వహించిన గ్రామ, వార్డు వలంటీర్ల అవార్డుల ప్రదానం కార్యక్రమంలో ప్రతిపక్ష నేతను విమర్శిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ప్రసంగాన్ని చట్ట విరుద్ధంగా ప్రకటించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని హైకోర్టు కొట్టేసింది. ముఖ్యమంత్రి ప్రసంగాన్ని చట్ట విరుద్ధంగా ప్రకటించడం ఏమిటంటూ హైకోర్టు ఒకింత ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ముఖ్యమంత్రి తన ప్రసంగంలో గత ప్రభుత్వంలో ఏర్పాటైన జన్మభూమి కమిటీలను, ప్రస్తుతం తీసుకొచ్చిన వలంటీర్ వ్యవస్థను పోల్చారని, దీనిని తామెలా తప్పుపట్టగలమని ప్రశ్నించింది. అలా పోలిక తేవడానికి వీల్లేదంటారా అంటూ నిలదీసింది. సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడం ద్వారా ప్రజలకు వలంటీర్లు మంచి పని చేయడంలేదా? మంచి చేసిన వాళ్లను సన్మానించకూడదా అని పిటిషనర్‌ను ప్రశ్నించింది. ఈ కార్యక్రమానికి ఖర్చు చేసిన మొత్తాన్ని ముఖ్యమంత్రి నుంచి వసూలు చేయాలని ఎలా కోరతారు అంటూ ప్రశ్నించింది. వలంటీర్లు ఎన్నికల విధుల్లో పాల్గొనాలా? వద్దా? అన్నది నిర్ణయించాల్సింది కేంద్ర ఎన్నికల సంఘమే తప్ప, తాము కాదని హైకోర్టు తేల్చి చెప్పింది. అందులో జోక్యం చేసుకోలేమంది. వలంటీర్లు ఎన్నికల విధుల్లో పాల్గొనకూడదని కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) ఇప్పటికే ఆదేశాలు ఇచ్చిందని సీఈసీ తరపు సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ హైకోర్టుకు వివరించారు. పోలింగ్ ఏజెంట్లుగా కూడా వ్యవహరించడానికి వీల్లేదని చెప్పామని, ఈ విషయంలో స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశామని తెలిపారు. వలంటీర్ల విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టమైన నిర్ణయం తీసుకున్నందున, ఈ వ్యాజ్యంలో విచారించేందుకు ఏమీ లేదని హైకోర్టు తేల్చి చెప్పింది. పిల్‌ను కొట్టేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల్లో వలంటీర్లకు ఎలాంటి విధులు అప్పగించకుండా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ ప్రకాశం జిల్లా అన్నంభొట్లవారి పాలెం గ్రామానికి చెందిన చెన్నుపాటి సింగయ్య హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేసిన విషయం తెలిసిందే.

ఏపీలో 2018 గ్రూప్–1 మెయిన్స్ పరీక్ష రద్దు

తిరిగి పరీక్ష నిర్వహించాలని హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) 2018లో నిర్వహించిన గ్రూప్–1 మెయిన్స్ పరీక్ష మాన్యువల్ మూల్యాంకనాన్ని హైకోర్టు చట్ట విరుద్ధంగా, ఏకపక్ష చర్యగా ప్రకటించింది. మూల్యాంకనంలో అక్రమాలు జరిగాయని తేల్చింది. అందువల్ల గ్రూప్–1 మెయిన్స్ పరీక్ష మొత్తాన్ని రద్దు చేస్తున్నట్లు తెలిపింది. తిరిగి మెయిన్స్ పరీక్ష నిర్వహించాలని అధికారులను ఆదేశించింది. నిబంధనల ప్రకారమే సమాధాన పత్రాలను మూల్యాంకనం చేయాలని చెప్పింది. పరీక్ష నిర్వహణకు ముందు అభ్యర్థులకు కనీసం రెండు నెలల సమయం ఇవ్వాలని ఆదేశించింది. మొత్తం ప్రక్రియను ఆరు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించింది. 2022 మే 26న ఏపీపీఎస్సీ ప్రకటించిన అర్హుల జాబితాను కూడా రద్దు చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు బుధవారం తీర్పు వెలువరించారు.

16న వైఎస్సార్ సీపీ అభ్యర్థుల ప్రకటన

ఒకేసారి 175 అసెంబ్లీ, 25 ఎంపీ స్థానాలకు ప్రకటించనున్న ఏపీ సీఎం జగన్

సాక్షి, అమరావతి: పేదింటి భవిష్యత్తును మరింత గొప్పగా మార్చేందుకు మరోసారి చారిత్రక విజయంతో అధికారంలోకి రావడమే లక్ష్యంగా ఎన్నికల సమరభేరి మోగించేందుకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధమయ్యారు. జనబలమే గీటురాయిగా, సామాజిక న్యాయమే పరమావధిగా ఇప్పటికే శాసనసభ, లోక్‌సభ స్థానాలకు సమన్వయకర్తల నియామక ప్రక్రియను దాదాపుగా పూర్తి చేశారు. ఒకవైపు టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిలో సీట్ల పంపకాలు, అభ్యర్థుల ఎంపికపై అసమ్మతి సెగలు పొగలు కక్కుతుండగా రెట్టించిన ఉత్సాహంతో అభ్యర్థులను ఖరారు చేసి కదనరంగంలోకి దూకేందుకు వైఎస్సార్ సీపీ సన్నద్ధమైంది. ఈమేరకు ఈనెల 16వతేదీన వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయలోని దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ఘాట్‌వద్ద 2019 ఎన్నికల తరహాలోనే ఒకేసారి 175 శాసనసభ, 25 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను సీఎం జగన్ ప్రకటించనున్నారు. ఆ వెంటనే ఈనెల 18 నుంచి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారు. రోజుకు రెండు లేదా మూడు సభలు, రోడ్ షోలు నిర్వహించేలా ప్రణాళిక సిద్ధమైంది. రోజూ ఒకే ప్రాంతంలో కాకుండా వేర్వేరు చోట్ల బహిరంగ సభలు, రోడ్ షోలు నిర్వహించేలా షెడ్యూల్ రూపొందించారు.

ఉరిమే ఉత్సాహంతో..

ఇప్పటికే నాలుగు ప్రాంతాల్లో భీమిలి(ఉత్తరాంధ్ర), దెందులూరు(ఉత్తర కోస్తా), రాప్తాడు (రాయలసీమ), మేదరమెట్ల(దక్షిణ కోస్తా)లో నిర్వహించిన సిద్ధం సభల ద్వారా వైఎస్సార్ సీపీ శ్రేణులను ఎన్నికలకు సన్నద్ధం చేశారు. ఆ సభలకు జనం పోటెత్తడం, ఒకదానికి మించి మరొకటి గ్రాండ్ సక్సెస్ కావడంతో ఉరిమే ఉత్సాహంతో కదనరంగంలోకి దూసుకెళ్లడానికి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు సిద్ధంగా ఉన్నారు. గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేయడం ద్వారా సీఎం వైఎస్ జగన్ విశ్వసనీయతను చాటుకున్నారు. ఈ ఎన్నికల్లోనూ అమలు చేయగలిగే హామీలతో మేనిఫెస్టో రూపకల్పనపై కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం అది తుది దశకు చేరుకుంది. అభ్యర్థులను ప్రకటించిన వెంటనే మేనిఫెస్టోను విడుదల చేసి ప్రచార భేరి మోగించాలని సీఎం జగన్ నిర్ణయించారు. టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి అభ్యర్థులను ప్రకటించేలోగా ప్రచారంలో దూసుకెళ్లే దిశగా అడుగులు వేస్తున్నారు.

చేసిన మంచిని వివరిస్తూ..
మోసాలను ఎండగడుతూ

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గత 58 నెలలుగా సీఎం వైఎస్ జగన్‌తోపాటు పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు, శ్రేణుల్లో ప్రజల్లోనే ఉన్నారు. జనంతో మమేకమవుతూ వారి సమస్యలను పరిష్కరిస్తున్నారు. సంక్షేమాభివృద్ధి పథకాల ద్వారా 87 శాతం కుటుంబాల ఖాతాల్లో డీబీటీ రూపంలోనే రూ.2.65 లక్షల కోట్లను సీఎం వైఎస్ జగన్ నేరుగా జమ చేశారు. పరిపాలన వికేంద్రీకరణ, సచివాలయాలు–వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలను పారదర్శకంగా ఇంటి గుమ్మం వద్దే అందిస్తున్నారు. వీటితోపాటు ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసిన అంశాన్ని సీఎం వైఎస్ జగన్ ప్రచారపర్వంలో వివరించనున్నారు.

పొద్దు వాలిన పొత్తు!

తమ వాళ్లకే సీట్లు ఇప్పించాలనుకున్న చంద్రబాబు ప్లాన్‌కు గండి

- బాబు చెప్పిన వాళ్లకే సీట్లిస్తూ... సంఖ్యను తగ్గించుకున్న పవన్
- 24కు ఓకే... 21కీ ఓకే... ఎంపీ సీట్లు రెండే ఇచ్చినా పీకే ఓకేఓకే
- ఇప్పటికే ప్రకటించిన ఆరు సీట్లలో ఒకటి ఇటీవలే చేరిన నేతకు
- తాజాగా భీమవరం టీడీపీ మాజీ నేతతోపాటు గంటా నరహరి చేరిక
- జనసేనలో అంతా బాబు చెప్పినట్టే జరుగుతోందంటున్న టీడీపీ వర్గాలు

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



పాండునాయక్



పాల శ్రీనివాస్

మహబూబ్‌నగర్ క్రీడలు/ మహమ్మదాబాద్: సూర్యాపేట జిల్లా చింతలపాలెంలో గత నెలలో జరిగిన 43వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ చాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబరిచిన జిల్లా క్రీడాకారుడు పాండు నాయక్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. త్వరలో బిహార్‌లో జరిగే జాతీయస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. క్రీడాకారుడి ఎంపికపై జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శాంతికుమార్, కురుమూర్తిగౌడ్, కార్యనిర్వాహక కార్యదర్శి రాజవర్ధన్‌రెడ్డి, సభ్యులు కేబీ.శ్రీరాములు, దామోదర్‌రెడ్డి, బాలరాజు, నర్సింహులు, శ్రీనివాసులు, మల్లేష్ బుధవారం హర్షం వ్యక్తం చేశారు. జాతీయస్థాయి పోటీల్లో రాణించాలని కోరారు.

■ మహమ్మదాబాద్ మండలంలోని చౌదర్‌పల్లికి చెందిన పాల శ్రీనివాస్ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. గత నెల 16న సూర్యాపేటలో 33వ రాష్ట్రస్థాయి కబడ్డీ సబ్ జూనియర్ పోటీల్లో ప్రతిభ కనబర్చాడు. ఈ నెల 16న బీహార్‌లో జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కోచింగ్ లేకుండా రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొనేందుకు ఎదిగిన శ్రీనివాస్‌ను పలువురు అభినందించారు.

మార్కెట్‌కు పోటెత్తిన ఉల్లి



దేవరకద్ర మార్కెట్ ఆవరణలో ఉల్లి కుప్పలు

- పెరగని ధరలతో రైతు దిగాలు
- క్వింటా గరిష్టంగా రూ.1,550.. కనిష్టంగా రూ.1,100

దేవరకద్ర: ఉల్లి దిగుబడి తగ్గినప్పుడు ధర ఆకాశాన్నంటగా.. దిగుబడి పెరిగినప్పుడు ధరలు పాతాళానికి చేరుతున్నాయి. గతేడాది దిగుబడి లేక రూ.3 వేల మార్కు దాటిన ఉల్లి ధర.. ఈ ఏడాది జనవరి నుంచి దిగుబడులు పెరగడంతో ధరలు సగానికి పడిపోయాయి. గరిష్ఠ ధరలు లభించిన రైతులు కొంత లాభాల్లో ఉండగా.. తక్కువ ధరలు వచ్చిన రైతులు నష్టాలను చవిచూడక తప్పలేదు. కూలి, రవాణా, పెట్టుబడి అన్నీ పోనూ రైతు చేతికందేది అరకొర మాత్రమే.

మార్కెటంతా ఉల్లి కుప్పలే..

బుధవారం దేవరకద్ర వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఎక్కడ చూసినా ఉల్లి కుప్పలే కనిపించాయి. సీజన్ కావడంతో చుట్టుపక్కల మండలాల నుంచి రైతులు పెద్దఎత్తున ఉల్లిని విక్రయానికి తీసుకొచ్చారు. దాదాపు 10 వేల బస్తాల ఉల్లి అమ్మకానికి వచ్చిందని అంచనా. స్థానిక వ్యాపారులతోపాటు బయటి వ్యాపారులు వేలంలో పాల్గొన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం వరకు ఉల్లి వేలం జోరుగా సాగింది.

ధరలు ఇలా..

నాణ్యమైన ఉల్లి క్వింటా గరిష్టంగా రూ.1,550 ధర పలికింది. గత వారం కన్నా రూ.వంద వరకు ధర తగ్గింది. ఇక రెండోరకం ఉల్లి కనిష్టంగా రూ.1,100లుగా నమోదైంది. గత వారం కన్నా రూ.50 వరకు తగ్గింది. ఇక ఎర్ర ఉల్లి బస్తా గరిష్టంగా రూ.వెయ్యి, కనిష్టంగా రూ.800 వరకు విక్రయించారు. మార్కెట్ నిబంధనల ప్రకారం బస్తాలో 45 కిలోలు తూకం వేసి విక్రయించారు. నాణ్యమైన ఉల్లి బస్తా గరిష్టంగా రూ.800, కనిష్టంగా రూ.550.. ఎర్ర ఉల్లి బస్తా రూ.550 నుంచి రూ.500 వరకు విక్రయించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు పెద్ద మొత్తంలో కొనుగోలు చేసిన ఉల్లిని నేరుగా వాహనాల్లో తరలించారు. చిరు వ్యాపారులు సైతం పెద్దఎత్తున కొనుగోలు చేశారు. సాయంత్రం వరకు మార్కెట్ సందడిగా కనిపించింది.

నష్టాలు రాలేదు..



ట్రాక్టర్ ఉల్లి విక్రయానికి తెచ్చా.. క్వింటా రూ.1,350 ధర పలికింది. కూలి డబ్బులు, ట్రాక్టర్ కిరాయి రూ.10 వేలు అయ్యాయి. పెట్టుబడి తీసేస్తే మిగిలింది అంతంత మాత్రమే. పెద్దగా లాభం లేకపోయినా నష్టం రాలేదని సంతోషిస్తున్నా.

– కాశమ్మ, రైతు, ఎడవెల్లి

కనీస ధర లభిస్తేనే..



తగ్గిన ధరలతో పరిస్థితి దారుణంగా ఉంది. కనీసం రూ.2 వేలు వస్తేనే కొంత వరకు లాభాలు ఉంటాయి. ట్రాక్టర్ ఉల్లి మార్కెట్‌కు తెచ్చి క్వింటా రూ.1,450 లెక్కన విక్రయించా. ఖర్చులన్నీ తీసేస్తే రైతుకు మిగిలేది చాలా తక్కువే. గత వారం రూ.100 ఎక్కువగా వచ్చింది. ఈ వారం ఇలా తగ్గిపోయింది.

– రాములు, రైతు, పోతన్‌పల్లి

మరోసారి మోదీ నాయకత్వాన్ని బలపరుద్దాం



జోగుళాంబ సన్నిధిలో ఎంపీ రాములు, బీజేపీ అభ్యర్థులు డీకే అరుణ, భరత్‌ప్రసాద్

జోగుళాంబ శక్తిపీఠం/గద్వాల రూరల్: ప్రజాసంక్షేమం, దేశాభివృద్ధికి అహర్నిశలు కృషిచేస్తున్న ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వాన్ని మరోసారి బలపర్చి, పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టాలని ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ కోరారు. నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ ఎంపీ స్థానాలకు బీజేపీ తరఫున అభ్యర్థిత్వం ఖరారు తర్వాత బుధవారం డీకే అరుణ, భరత్ ప్రసాద్‌లు ఎంపీ రాములుతో కలిసి అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలను దర్శించుకున్నారు. ముందుగా వారికి ఆలయ అర్చకులు సాదర స్వాగతం పలికారు. ఉభయ ఆలయాల్లో ప్రత్యేక పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేసి, వేద ఆశీర్వచనం చేశారు. అనంతరం గద్వాలలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డీకే అరుణ మాట్లాడారు. పదేళ్ల కాలంలో ప్రధాని మోదీ దేశాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడంతోపాటు దేశ రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టారన్నారు. దేశంలో ఎన్ని శక్తులు ఎదురైనా ప్రజలు మళ్లీ బీజేపీకి పట్టం కట్టడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. అన్ని సర్వేలు బీజేపీకే అనుకూలంగా ఉన్నాయని చెప్పారు. రాబోయే ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ఓటువేస్తే వృథా అవుతుందన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలుచేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ.. 90 రోజులు అవుతున్నా హామీలను నెరవేర్చలేకపోయిందని విమర్శించారు. మరోసారి కాంగ్రెస్ పార్టీ మోసపు మాటలను నమ్మితే నష్టపోతామన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సెగ్మెంట్‌లో బీజేపీ అభ్యర్థి భరత్ ప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీ రాములు మాట్లాడుతూ కశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేసిన దమ్మున్న నేత ప్రధాని మోదీ అని అన్నారు. తన కుమారుడు భరత్‌ప్రసాద్‌కు ఎంపీ టికెట్ వచ్చేలా కృషిచేసిన డీకే అరుణకు ధన్యవాదాలు తెలియజేశారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి, తల్లోజు ఆచారి, లోక్‌నాథ్‌రెడ్డి, రఘునందన్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, సుధాకర్ రావు ఉన్నారు.

కామర్స్ ఫెస్ట్- ప్రేరణను విజయవంతం చేయాలి



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న పీయూ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్ తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: తెలంగాణ కామర్స్ అసోసియేషన్, పీయూ వాణిజ్యశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 19 విశ్వవిద్యాలయ స్థాయిలో నిర్వహించే ఇంటర్ కాలేజ్ కామర్స్ ఫెస్ట్- ప్రేరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీయూ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్ అన్నారు. బుధవారం ఆయన కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేసి మాట్లాడారు. విద్యార్థుల్లో సబ్జెక్టు పెంచి సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా వ్యాసరచన, వక్తృత్వం, కామర్స్ క్వెస్ట్, బిజినెస్ క్విజ్, ఫేస్ పెయింటింగ్, పీపీటీతో పేపర్ ప్రజెంటేషన్, జెస్ట్ ఏ మినిట్, రంగోళి వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. యూనివర్సిటీలో గెలుపొందిన విద్యార్థులకు ఈ నెల 23న సికింద్రాబాద్‌లో రాష్ట్రస్థాయి నిర్వహించే కార్యక్రమంలో బహుమతులను ప్రదానం చేస్తామన్నారు. యూనివర్సిటీ పరిధిలోని అన్ని కళాశాలల అధ్యాపకులు, ప్రిన్సిపాళ్లు విద్యార్థులు క్రమంగా కార్యక్రమంలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి, కంట్రోలర్ రాజ్‌కుమార్, కృష్ణయ్య, భాస్కర్, రంగప్ప, సురేష్ పాల్గొన్నారు.

అనుమానిత వ్యక్తులతో జాగ్రత్త

పెబ్బేరు రూరల్: అనుమానిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని.. కాలనీల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు సూచించారు. జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీలో బుధవారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈసందర్భంగా 56మంది పోలీస్ సిబ్బంది బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించారు. సరైన పత్రాలు, నంబర్ ప్లేట్స్ లేని 36 వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించి, సీజ్ చేశారు. అనంతరం కాలనీవాసులనుద్దేశించి డీఎస్పీ మాట్లాడుతూ కొత్త వ్యక్తుల పూర్తి వివరాలను తెలుసుకున్న తర్వాతే ఇళ్లను అద్దెకు ఇవ్వాలని సూచించారు. మాధక ద్రవ్యాలు, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. చోరీల నివారణకు ప్రతి కాలనీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐ నాగభూషణం పాల్గొన్నారు.



ఇందిరానగర్ కాలనీవాసులతో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు

మైసమ్మ ఆలయ అభివృద్ధికి కృషి



మైసమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

నవాబుపేట: మైసమ్మ ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందిందని, ఈ దేవాలయం అభివృద్ధిలో మున్ముందు తమ పాత్ర మరింత కీలకంగా ఉంటుందని ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మైసమ్మ ఆలయ వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసి భక్తులకు అందుబాటులో మరిన్ని సదుపాయలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి విషయంలో అమ్మవారి అనుగ్రహం ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అంతకు ముందు ఆయనకు ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక ఆశీర్వచనం చేశారు.

ఉత్సవాలు ప్రారంభం

పర్వతాపూర్ మైసమ్మ ఆలయ 15వ వార్షికోత్సవ కార్యక్రమాలు బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ధ్వజారోహణం, గణపతి పూజ చేశారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం కళశాభిషేకం, హోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ కృష్ణయ్య, ఆలయ అధికారి మధనేశ్వర్‌రెడ్డి తెలిపారు. కాగా వార్షికోత్సవ ప్రారంభంలో ముఖ్య అతిథులుగా సింగిల్ విండో చైర్మన్ నర్సింహులు, ఎంపీపీ అనంతయ్య, మధుసూదన్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో కాకర్లపహాడ్ మాజీ సర్పంచ్ జంగమ్మ, నాయకులు మాధవులు, నర్సింహులు, సంజీవరెడ్డి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.